క్లుప్తంగా

జిల్లా స్థాయి మారథాన్ విజేత పర్వీన్



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీన నిర్వహించిన ఐదు కిలోమీటర్ల పరుగు పందెం (మారథాన్)లో టీజేపీఎస్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఎస్‌కే పర్వీన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి తెలిపారు. సోమవారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిళా విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పర్వీన్ జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి నుంచి రూ.10వేలు బహుమతిగా అందుకున్నట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న పర్వీన్ ఈనెల 25న రాష్ట్ర స్థాయి మారథాన్‌లో పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు శ్యాం సుందర్, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, పీజీ ప్రిన్సిపాల్ ఎస్.అనితాదేవి, వ్యాయామ అధ్యాపకుడు టి. వాసుదేవరావు, కోచ్ ఆర్. శివాజీ, ఇంటర్ ఇన్‌చార్జ్ జి. సురేష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థిని పర్వీన్‌ను అభినందించారు.

విద్యార్థులంతా స్నేహ భావంతో మెలగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితం అందమైనదని, తోటి విద్యార్థులతో స్నేహ భావంతో మెలగాలని కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో సోమవారం ప్లస్-1 విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నవారంభ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జీవితం ఒక ప్రయాణమని, ఇందులో ఎన్నో మలుపులు ఉంటాయని తెలిపారు. క్రమశిక్షణతో ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. ప్రిన్సిపాల్ జి. రత్తయ్య మాట్లాడుతూ ప్లస్-1, ప్లస్-2 విద్యార్థులు పరస్పరం సంఘీభావాన్ని చాటుతూ విద్యార్థి దశను ఆహ్లాదంగా మలచుకుని, భావితరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఒడిదుడుకులను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు కె.బసవ పున్నయ్య, ఏవో కె.వెంకట్రావు, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ శైలజ అభినందనలు తెలిపారు.

బాలచంద్రరావు కళాకార పురస్కారం ప్రదానం



నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సో వారం ప్రముఖ రంగస్థల నటులు మంచా బాలచంద్రరావు పంచమ వర్ధంతి సందర్భంగా పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు ఎం.వి.ఎల్.నరసింహారావు సభకు అధ్యక్షత వహించారు. బాల చంద్రరావు సేవలను వక్తలు గుర్తు చేశారు. అనంతరం రంగస్థల నటుడు, హార్మోనిస్టు గురప్రశాల శ్రీనివాసరావును బాలచంద్రరావు కళాకార పురస్కారంతో సత్కరించారు. సభానంతరం సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. హరిశ్చంద్రుడిగా పల్నాటి సుబ్బారావు, జీవీ శివశంకర్, చంద్రమతిగా తిరుమల, నక్షత్రకులుగా జి.శ్రీనివాస్, పీట వెంకటేశ్వరరావు, కాలకౌశికుడిగా పత్తి శౌరీలు, వీరబాహుడుగా రామినేని సాంబశివరావు తదితరులు చక్కని గాత్రధారణతో పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. హార్మోనియంపై ఎస్.సిద్దయ్య, తబలాపై మోపర్రు శ్రీనివాస్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు, దర్శకుడు కావూరి సత్యనారాయణ, డాక్టర్ ఆలపాటి అనూరాధ, షేక్ సైదా, సంస్థ కోశాధికారి మంచా కృష్ణమోహన్, ఎం.గణేష్, ఎల్.శంకర్, చింతల ఆనంద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: రోడ్డు విస్తరణ పనులు, లైనుల మెయింటెనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు గుంటూరు టౌన్-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టాభిపురం, ఎన్‌సీసీ అపార్టుమెంట్స్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా
- మాయాబజార్‌లో అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం
- పూర్తయ్యేంత వరకు అక్కడే భైఠాయింపు
- ప్రజా సమస్యలను పట్టించుకోని పాలకులు
- ప్రజలను ఇబ్బందులు పెట్టి పైశాచిక ఆనందం
- నియోజకవర్గ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు



డెప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసి వివరాలు వెల్లడిస్తున్న నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

నెహ్రూనగర్: నగర ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైతే ధర్నాకు దిగుతామని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ లక్ష్యం, ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో కార్యక్రమంలో నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసును కలిసి, నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాయాబజార్‌లో మైనార్టీలు వ్యాపారం చేసుకుంటేనే వారి జీవనం సాగుతుందని తెలిపారు. నాలుగు నెలల కిందట రోడ్డు నిర్మాణం సగం చేపట్టి మిగతాది వేయకుండా వ్యాపారులను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

టీడీపీకి మైనార్టీలంటే చిన్నచూపు

టీడీపీకి మైనార్టీలంటే ఎందుకు చిన్నచూపని ఆమె ప్రశ్నించారు. సంగడిగుంట 14వ వార్డులో 1, 2, 3 వీధుల్లో డ్రెయిన్లు నిర్మించి, రోడ్లు వేయకుండా వదిలేశారన్నారు. అక్కడ ఉన్న మసీదుకు వెళ్లడానికి ముస్లింలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే రోడ్లు ఆగిపోయాయని అనుమానం వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న పీకలవాగు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆమె కోరారు. పొన్నూరు రోడ్డులో ఎమ్మెల్యే నసీర్ చెప్పిన వారి ఆక్రమణలు తొలగించకుండా, మిగిలిన వారివి తొలగించడం ఏంటని ప్రశ్నించారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు అందరిని సమన్యాయంగా చూడాలని, అధికార పార్టీకి ఓ న్యాయం, విపక్షాలకు మరో న్యాయం చేయవద్దని హితవు పలికారు. గత పదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా అందర్ని సమానంగా చూసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యల్ని పరిష్కరించాలని, లేనిపక్షంలో ధర్నా చేపడతామని ఆమె హెచ్చరించారు.

ప్రతి గడపలో చంద్రబాబు వాగ్దానాల నిరాశ



మహిళ సమస్యను తెలుసుకుంటున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రతి గడపలోనూ చంద్రబాబు వాగ్దానాల నిరాశ స్పష్టంగా కనబడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 2, 4, 5 డివిజన్ల పరిధిలో సోమవారం బాబు ష్యూరిటీ- మో సం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి నూరి ఫాతిమా వెళ్లి చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, అమలు చేయని విధానాలను వివరించారు. రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని తెలిపారు. సిగ్గు, ఎగ్గులేకుండా లేనిపోని హామీలు ఇచ్చి, ప్రజలను నిలువునా వంచించారని విమర్శించారు. చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మహిళల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. మహిళలంటే ఏమాత్రం గౌరవం లేకుండా పోయిందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో ఇంతకు ఇంత మూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, శివనారాయణ, రామయ్య, కన్న, ఆయూబ్ జాని, రమేష్, చాణక్య, యేసోబు, సుబ్బులు పాల్గొన్నారు.

నన్స్ అరెస్టును ఖండిస్తూ రేపు శాంతి ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు, ఫాదర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

నెహ్రూనగర్: ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్‌లో సిస్టర్ వందన ఫ్రాంచెస్, సిస్టర్ ప్రీతి మేరీల అక్రమ అరెస్టులను నిరసనగా ఈ నెల 6న నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంఘాల ఐక్యత పరిరక్షణ కమిటీ నాయకులు చెప్పారు. నగరంపాలెంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సోమవారం శాంతి ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ దేశంలో క్రైస్తవులు, సంఘాలపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. 6న సాయంత్రం 4 గంటలకు ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న సెయింట్ ఆగ్నేస్ చర్చి నుంచి శాంతియుత ర్యాలీ ప్రారంభమై, మూడు బొమ్మల సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందని తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు గాబ్రియేల్, సహదేవ్, నెహెమ్యా, మార్కు, కిరణ్, సౌజన్య, రాజు, విజయ్‌పాల్, వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మద్దు ప్రేమజ్యోతిబాబు, భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



అవగాహన కార్యక్రమంలో డాక్టర్ రాజకుమారి

గుంటూరు మెడికల్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అహల్య హాస్పిటల్‌లో సోమవారం తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డకు ఎంత అవసరమో వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలో వచ్చే పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రుపాలు) బిడ్డకు అమృతం లాంటివని వివరించారు. తల్లి పాలు సంపూర్ణ ఆహారమని, బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని తెలిపారు. బిడ్డలో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలే సంపూర్ణ ఆహారమన్నారు. ఆ తరువాత తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయని తెలిపారు. పిల్లల మేధస్సు ను మెరుగుపరచడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కరీమా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రుపాలుతో బిడ్డకు ఆరోగ్యం

నెహ్రూనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆనందపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ ప్రసవం అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం ఎంతో ఆరోగ్యమని తెలిపారు. ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లను కూల్చితే చూస్తూ ఊరుకోం!

సీపీఐ నగర కార్యదర్శి అరుణ్ కుమార్



కలెక్టరేట్ ప్రాంగణంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

లక్ష్మీపురం: మోతీలాల్ నగర్‌లో ఇళ్లను కూల్చితే ఊరుకోమని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతీలాల్ నగర్ వాసులు ఐదు దశాబ్దాలుగా పక్కా గృహాలు నిర్మించుకుని ఉంటున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా బలవంతంగా కూల్చివేస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, అన్యాయంగా ఇళ్లను ధ్వంసం చేస్తూ ఉంటే సహించేది లేదని తెలిపారు. టిడ్కో ఇల్లు లేదా ఎన్డీఏ కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెండు సెంట్లు స్థలం, ఐదు లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల నుంచి వచ్చే ప్రతిఘటనకు అధికారులే పూర్తి బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు జంగాల చైతన్య, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, మోతీలాల్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా నగరంలోని లిబర్టీ థియేటర్ ఎదురుగా ఉన్న విద్యుత్ కేంద్రం వద్ద నిర్వహించనున్న ధర్నాలో నాయకులతో పాటు పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకొని, లేనిపక్షంలో మరొక్కసారి విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మేడా హనుమంతరావు , సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలి

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాలైన 53, 54, 55 వార్డుల్లో కమ్యూనిటీ హాల్స్, లైబ్రరీలు, క్రీడా మైదానం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో నగర అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పరిధిలో శ్మశానవాటికకు స్థలం, నిరుపేద కుటుంబాల పార్థివ దేహాల సందర్శనార్థమై సత్రాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మణికుమారి, వాసు, నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు గౌరవం లేదు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వంలో మహిళలను బొమ్మల్లాగా చూస్తున్నారని, వారి మీద గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఓ మహిళతో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో తిరుగుతోంది. ఈ నేపథ్యంలో నూరి ఫాతిమా మాట్లాడుతూ కూటమిలోని పలువురు ప్రజా ప్రతినిధులు మహిళలతో అసభ్యంగా మాట్లాడిన అంశాలు చాలా ఉన్నాయని తెలిపారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే అయి ఉండి మహిళను బొమ్మలాగా చూస్తూ, అసభ్యంగా మాట్లాడం చూసి ప్రజలు తలదించుకునే పరిస్థితికి తెచ్చారన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వీడియో ఏఐతో ప్రతిపక్షాలు చేశాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజల అభిమానం పొందాలని అనుకుంటున్నామే తప్పా రాజకీయ లబ్ధి పొందాలని ఎప్పుడూ తాము అనుకోలేదని తెలిపారు. నసీర్ మీద అబద్ధపు మాటలు, వీడియోలు చేసే నీచమైన పార్టీ తమది కాదని ఫాతిమా తెలిపారు. అది తమ పార్టీ సిద్ధాంతం కూడా కాదని వివరించారు. కూటమి ప్రజా ప్రతినిధులు ప్రజలకు మంచి చేయాలే తప్పా మహిళలను ఇబ్బందులు పెట్టే సంస్కృతి మానుకోవాలని ఆమె హితవు పలికారు.

అంగన్‌వాడీ ఆయాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని వీవర్స్ కాలనీ, గోరంట్ల పెద బావి, ఆనందపేట, లక్ష్మీనరసింహపురం, ఎల్‌బీనగర్, వసంతరాయపురం, శారదాకాలనీ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని అంకిరెడ్డిపాలెం, స్వర్ణభారతీ నగర్, భాగ్యనగర్, బోసుబొమ్మ, శ్యామలానగర్, శ్రీకృష్ణదేవరాయనగర్ ప్రాంతాల్లో ఆయా పోస్టులు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సున్న మహిళలు ఈ నెల 14వ తేది సాయంత్రం 5 గంటలలోపు గుంటూరు అర్బన్ కార్యాలయం(శ్రీలక్ష్మీ నిలయం, హనుమాన్ నగర్ 6వ లైను, ఏటీ అగ్రహారం)లో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

59 నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ పూర్తి

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు వచ్చిన 59 నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ పూర్తయిందని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. అన్ని నామినేషన్లు నిబంధనల ప్రకారం ఉన్నాయని చెప్పారు. స్క్రూటినీ పూర్తయిన నామినేషన్ల వివరాలను ఎన్‌టీఆర్ స్టేడియంలో ప్రదర్శించామని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఆయన సూచించారు. ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం మధ్యాహ్నం 3 గంటల తరువాత ఫైనల్ లిస్ట్‌లను ప్రదర్శిస్తామని చెప్పారు. ఈ నెల 18న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీలో శాశ్వత సభ్యత్వం కలిగిన అభ్యర్థులంతా ఈ నెల 10వ తేదీలోపు ఎన్టీఆర్ స్టేడియం శాశ్వత సభ్యత్వ ఐడీ నంబర్, పేరు, ఫోన్ నంబర్ వివరాలను రెండు పాస్ పోర్ట్ ఫొటోల వెనుక వైపు రాసి, స్టేడియంలోని కౌంటర్‌లో అందజేయాలని ఆయన సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

నగర మేయర్ రవీంద్ర



ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో అందే ఫిర్యాదులపై అశ్రద్ధ వద్దని, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్‌ను అదనపు కమిషనర్ ఓబులేసు నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 20 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా మేయర్ అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని తెలిపారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ ఛాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. పీజీఆర్ఎస్ ద్వారా 31 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 9, ఇంజినీరింగ్ విభాగానికి- 5, రెవెన్యూ విభాగానికి- 8, ప్రజారోగ్య విభాగానికి- 6, అకౌంట్స్ విభాగానికి -3 చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ(ఇన్‌చార్జి)లు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం హౌసింగ్ బోర్డ్ కాలనీ, నల్లకుంట, ఎన్జీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా రోడ్లపై ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని, హౌసింగ్ బోర్డ్ కాలనీ మామిడి గార్డెన్స్ దగ్గర ఔట్ ఫాల్ డ్రెయిన్‌పై నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా శ్యాంపిల్స్ తీసి ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం చుట్టగుంట సెంటర్‌లో రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణలను పరిశీలించారు. రెండు రోజుల్లో తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ వద్దని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈ వెంకటరమణ, ఎస్ఎస్ రాజేష్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పని చేయని ఫోన్లు మాకొద్దు!

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

నెహ్రూనగర్: పని చేయని ఫోన్లు తమకు వద్దని, సిగ్నల్ అందక నానా అవస్థలు పడుతున్నామని గుంటూరు అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు చెక్ చేసే సమయంలో సర్వర్ పనిచేయకపోవడం , సిగ్నల్ అందక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. పని చేయని 2జీ ఫోన్లతో చస్తూంటే మరో పక్క సూపర్‌వైజర్ల పని ఒత్తిడితో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ ఫోన్లతో పని చేయలేమని సీడీపీఓ అరుణకు తెలిపారు. వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం యాప్‌లకు సరిపడా సామర్థ్యం లేకపోవడంతో పనిచేయడం లేదని, వెంటనే 5జీ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీడీపీఓ తీసుకోకపోవడంతో అక్కడే ఫోన్లు వదిలేసి వెళ్లిపోయారు.

డైట్ ఫైల్‌తో నాకు సంబంధం లేదు

- ఆర్డీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన సీనియర్ అసిస్టెంట్
- డైట్‌ఫైల్ మిస్సింగ్‌పై ఇప్పటికీ తేలని లెక్క

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో రోగులకు ఆహారం సరఫరా చేసే డైట్ కాంట్రాక్ట్ ఫైల్‌తో తనకు సంబంధం లేదని, గతంలో ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన లంకపల్లి శ్రీనివాసరావు సోమవారం గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకులు (ఆర్డీ)కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనకు సంబంధం లేకపోయినా డైట్ కాంట్రాక్ట్ ఫైల్ మిస్సింగ్ వ్యవహారంలో తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేశారని, దీనిపై ఆర్డీ కార్యాలయ అధికారులు లోతుగా విచారణ చేయాలని ఆయన కోరారు. తాను ఆసుపత్రిలో హెచ్‌డీఎస్ క్లర్క్‌గా పనిచేస్తున్న సమయంలో కోవిడ్ డైట్ కాంట్రాక్ట్ ఫైల్ హెచ్‌డీఎస్-2 సెక్షన్‌లో ఉండేదని తెలిపారు. తాను హెచ్‌డీఎస్-1 సెక్షన్‌లో పని చేశానని, తనకు సంబంధం లేని ఫైల్‌పై తనకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై తాను వివరణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

నాలుగేళ్లుగా విచారణ

2019లో కోవిడ్ రోగులకు సరఫరా చేసిన డైట్ ఫైల్ అదృశ్యమవడంపై ఆసుపత్రిలో నాలుగేళ్లుగా విచారణ సాగుతూనే ఉంది. దీనిపై ఇప్పటి వరకు ఎవరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదు. ఆసుపత్రిలో ఫైల్, అది కూడా కలెక్టర్ చైర్మన్‌గా హెచ్‌డీఎస్ ఫైల్ అదృశ్యమవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఐదేళ్లుగా డైట్ ఫైల్ మిస్సింగ్‌పై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు సైతం పలువురు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నేటి వరకు ఎక్కడ ఉందనే విషయం బయటకు రాలేదు. కోవిడ్ రోగులకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టర్ పలు అవకతవకలకు పాల్పడ్డాడని, దీనికి ఆసుపత్రి అధికారులు, కార్యాలయ ఉద్యోగులు సపోర్టు చేశారని, అందువల్లే ఫైల్ మిస్సైందని ఆరోపిస్తూ తాజాగా జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు వచ్చాయి.

ప్రాధాన్యతా క్రమంలో నగరాభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే మాధవితో కలిసి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 42, 43వ డివిజన్లలో రూ.1.49 కోట్లతో అభివృద్ధి పనులకు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. న్నారు. నగరాభివృద్ధిలో స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకొని వెళతామని, వారి అభిప్రాయాల మేరకు పనులు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.